## పుస్తకం - ప్రాశస్త్యం

మారవచ్చునేమో స్వరూపం కానీ,
చెక్కుచెదరనిది పుస్తకం
జ్ఞాన సముపార్జనకు
ఏకైక సాధనం.

ఒక స్నేహితుడితో సమానం
అనుభవాలను నేర్చి
జీవితంలో మార్పును తెస్తుంది ఒక మంచి పుస్తకం.

పుస్తక పఠనం కల్గించు మానసిక ఉల్లాసం..
కలుగును శారీరక ఆరోగ్యం ఒత్తిడి నుండి విముక్తిని
ప్రసాదించు సాధనం..
వార్తలకు పత్రిక రూప సమాహారం.

సమ సమాజు నిర్మాణ కృషి చేసిన
రచనలకు రూపం..
సాహిత్య పిపాసుల కవ, కవయిత్రుల
కవనాలకు కవితలుగా సాక్ష్యం.

కథలు,కవితలు,
నవలలు, వ్యాసాలు,రచనలు,
వింతలు విశేషాలతో
అన్నింటి మేలు కలియికల సమాహారం
విజ్ఞాన భండాగారం..
గురువుగా మనలో నింపు జ్ఞానోదయం.

శాస్త్ర, సాంకేతిక అంశాలకు
సృష్టి రహస్యాలకు ప్రతిబింబం..
జీవన ఉపాధికి ఆలంబనం
లక్ష్యాన్ని దరిచేర్చే మార్గదర్శకం.

ఆలోచనలకు నిలయం
ఆశయాలకు ఆలయం
మనలో తొలగించు అజ్ఞానం
వెలుగు రూపంలో పంచు విజ్ఞానం.

అందుకే ప్రపంచ పాఠకులారా
పుస్తకాన్ని కొందాం,కొనిపిద్దాం..!
నేటి కాలంలో
కనుమరుగు అవుతున్న
పుస్తకాన్ని బ్రతికించుకుందాం..!!



-ఎన్.. రాజేష్
9849335757

## మస్తిష్కపు నిధి "పుస్తకం"

చోరులకు దొరకనిది
అగ్నికి అంటనిది
నీటి తాకిడికి కనుమరుగుకానిది
పుస్తకజ్ఞానం...!
మహోన్నతమైన విజ్ఞానాన్ని
పళ్లెంలో పెట్టి అందించేది పుస్తకం!
మానవ జీవితంలో విడదీయరాని భాగం పుస్తకం!
అలసిన మనసులకు
పదాలతో పలకరించేది పుస్తకం!
అక్షరాలను తనలో అందంగా దాచుకున్న
తరగని గని పుస్తకం!
చందమామ కథలతో పసితనంను
నిద్ర పుచ్చుతుంది పుస్తకం!
బ్రతకడం కంటే జీవించడం అంటే
ఏమిటో నేర్పిస్తుంది పుస్తకం!
మస్తిష్కాలను మధించి, శోధించి
మేధోసంపత్తిని పెంపొందించేదే పుస్తకం!
ప్రశ్నించే తత్వాన్ని అలవర్చేది పుస్తకం!
మనోవికాసానికి ,మార్గ నిర్దేశానికి గురువు పుస్తకం!
మానవ ప్రజ్ఞా పాటవాలకు నిలువెత్తు సాక్ష్యం పుస్తకం!
జీవితాన్ని చీకటికమ్మేసినప్పుడు
దీపమై దారి చూపే జ్ఞాన జ్యోతి పుస్తకం!
తనువు అంతమయ్యే వరకు తోడుగా నిలిచే నేస్తం పుస్తకం!

'వస్త్రం' అనేది శరీరాన్ని మాత్రమే కప్పుతుంది
అదే ఒక "మంచి పుస్తకం"
కోటి మెదళ్లను కదిలిస్తుంది!
ఆస్తులు కరిగిపోవచ్చు
ధనం దొంగలపాలు కావచ్చు
అనుబంధాలు చెరిగిపోవచ్చు
కానీ పుస్తకాలతో వచ్చిన విజ్ఞానం
ఎన్నటికీ తరిగిపోదు!
సమిదలవుతున్న భారమైన బ్రతుకులను
ఆశలనే ప్రమిధలుగా నిత్యం వెలిగింపజేసే
కాంతిపుంజం పుస్తకం!
జీవితాన్ని ఉన్నత శిఖరంలో
నిలబెట్టే హస్తభూషణం పుస్తకం!
విరామ కాలంలో ఉపయోగపడే
ఊతకర్ర పుస్తకం!
ఆయుధం అనుభవం అయితే
ఆశయాన్ని మాత్రమే గెలవచ్చు,
కానీ ఆయుధమే పుస్తకం
అయితే ప్రపంచాన్నే గెలవచ్చు!!!



-నందిని గోపు
6302398650

## నిత్యసత్యాలు...!

ఆత్మగౌరవంబు నాత్మీయతనుపెంచు
ఆత్మబలముయున్న హాయినొందు
చిత్తమందుమంచి సేవభా వములున్న
జీవనంబు సాగు పావనంబు!

స్వార్థరహితప్రేమ సౌఖ్యమేనిచ్చును
సఖియ సఖుల కిల సంబరమ్ము
అఖిలసృష్టియంత యానందమునబుట్టె
సత్యమరసిజూడ సారమిదియె!

ప్రకృతిజీవనంబు పరమసంతోషంబు
వికృతిబ్రతుకులందు వింతలేను
అంతులేనిశక్తి యద్భుతలీలలు
మానవాళికిలను మార్గమాయె!

నాగరితలుపెరిగి నామోసిలేకుండను
వేష ధారణమనె వేళ్ళుదిగెను
యువతమోజులోన యుక్తులన్నియుమర్చి
సాలెపురుగు వలలొ సాగిలపడె!

సాంప్రదాయ రీతి సమసిపోయెనుచూడ
చిరుగు బట్టలందు చిందులెగసె
చెప్పువారులేక చెడుతుంది యువతయే

తల్లిదండ్రి మాట దారి తప్పె!

తప్పులన్నిజేసి తర్కించు వారలు
ఒప్పుమాట నెపుడు నొప్పు కోరు
తానుబట్టునట్టి తనదు కుందేలుకు
మూడుకొమ్ములన్ని మురియుచుంద్రు!

తప్పు దారులందు తరలు వారందరు
మంచి వారి తోడ మసలలేరు
నీటి లోనికప్పు నీరజరసమును
గ్రోలలేదు జూడ గోప్యమరయ!

కాలరీతి మారె కడగండ్ల రైతుల
బాధలెరుగు వాడు బాంధవుండు
ఎండసమయమందు యెనలేనివర్షాలు
రాజనాల పంట రాళ్ళపాలు!

వృత్తులన్నినేడు రూఢిగా పాడాయె
పొడుగుచెయ్యివాడె పొందుఫలము
అట్టడుగు ప్రజలకు నండనేలేదాయే
ఎవడిబ్రతుకువాడు యెంచుకొనిరి!

పరులమేలుకోరు పరగ నెవ్వడులేడు
తనకుతాను బ్రతుక తపనలాయె
పొరుగువాళ్ళ గూర్చి పొందికలేదాయే
తీరుమారెమనిషి తీవ్రముగను!

పాతక్రొత్తరీతి పాడు చేయకనుండిన
యువతహాయి పొందు యుక్తిగాను
మంచికాలమెపుడు మహిలోనయున్నను
సకల జనుల కిలను సంతసంబు!



-డాక్టర్ గన్నోజు శ్రీనివాసాచార్య
8555899493

## పద్మవ్యూహం

నెపంథిస్ లో కీటకాల కమురు వాసన
సాలీడు వలలో ఈగల గిలగిల
దీపం చుట్టూ శలభాల శవాలు
పద్మవ్యూహంలో విషం బానిసలు
మత్తు స్వేచ్ఛామార్కెట్ నిశీధిలో
నగ్నంగా నర్తిస్తోంది
తాగి తాగి జీర్ణాశయం
కుళ్ళికుళ్ళిపోనీ
అతలాకుతలమై లావాతో
గుండెమండనీ
మందు కూపంలో
కుటుంబాలు మునగనీ
మురికి మత్తులో
అరాచకాలు కరాళ నృత్యం చేయనీ
వాహనాలు నడిపే హస్తాలు తడబడనీ
రోడ్లు రక్తపుటేరులై ప్రవహించనీ
కుటుంబం అద్దం తునాతునకలై పోనీ
తాళితెగి శిధిలమై పోనీ
అస్తిపంజరాల సింహాసనం మీద
విజయ పతాకం రెపరెపలాడాలి
మత్తుమనిషి మారి గృహక్షేత్రంలో
మమతల వెన్నెల వెదజల్లితే
ఆత్మీయత అమృతం ప్రవహిస్తే
తనివితీరా చూడాలనుంది
ఈ దక్షయజ్ఞం మొదలు పెట్టిందెవరు?
ముగింపునిచ్చేది ఎవరు?
మందుమాట మరిచిన
మహోన్నత రాజ్యం రావాలి
సామాన్యుడి జీవితంలో
మహోజ్వల కాంతులను నింపాలి.



-డి.కె.చదువుల బాబు.
9440703716

## బాబూజీ ...

ప్రజారాజ్య నిర్మాణానికి నిరంతరం కృషిచేసి
ఉత్తమ పార్లమెంటేరియన్ గా నిలిచిన దార్శనికుడు
విస్తృతమైన అధ్యయన శీలి బాబూజీ !

స్థిరమైన సంకల్పంతో అడుగులు వేసి
నవభారత నిర్మాణంలో ఉదాత్తమైన పాత్ర
గొప్ప స్వాతంత్రోద్యమ నేత బాబూజీ !

సుదీర్ఘకాలం మంత్రిగా విధులు చేపట్టి
ప్రపంచ రికార్డు నెలకొల్పిన ఆదర్శ నేత రాజకీయ
వనంలో తులసీ మొక్క బాబూజీ!

తాడిత పీడిత జనులను ఏకతాటిపై నడిపి
సమానత్వం కోసం బాటలు వేసిన నేత
గొప్ప కార్య నిర్వహణాధ్యక్షుడు బాబూజి !

కులవివక్ష వెనుకబాటుతనంపై అధ్యయనం చేసి
రాజ్యాంగ నిర్మాణంలో అందెవేసిన చేయి
గొప్ప సంఘసంస్కర్త బాబు జగ్జీవన్ రామ్ !

(మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా...)

-రవి చంచల
8500330700

## అన్ని రోజులూ హాజర్ (కథ)

మేము విమెన్స్ కాలేజీలో చదివే రోజుల్లో మాకు తెలుగు క్లాస్ అంటే కొంచెం బోర్ గా ఉండేది . తెలుగే కదా ! తెలిసిన పాఠాలే కదా ! ఇంట్లో చదువు కోవచ్చు అనిపించేది. అందులో మాకు చెప్పే లెక్చరర్ యశోద రెడ్డి గారు. ఆవిడ యూనివర్సిటీ కాలేజీలో రెండు క్లాసులు తీసుకొని , మా కాలేజీకి వచ్చేవాళ్ళు. ఒక్కొక్కసారి అక్కడ లేట్ అయితే మా కాలేజీకి వచ్చేవాళ్ళు కాదు. అందుకని మాకు తెలుగు క్లాస్ ఉన్నప్పుడు , ముందర మేము స్టాఫ్ రూమ్ కి వెళ్లి మేడం వచ్చారో లేదో చూసుకుని వచ్చేవాళ్ళం. ఆవిడ రాకపోతే హాయిగా కాలేజీ లో వున్న లాన్స్లో కూర్చుని ఎంజాయ్ చేసేవాళ్లం. ఒక్కొక్కసారి ఆవిడ అటెండెన్స్ రిజిస్టర్ తీసుకుని వచ్చేవాళ్ళు కాదు. రెండు మూడు రోజులకే ఒకసారి ఆవిడ చేతిలో అటెండెన్స్ రిజిస్టర్ ఉండేది . ఆ వారానికంతా కూడా అప్పుడే అటెండెన్స్ వేసేవాళ్ళు. పరీక్షలు రాయాలంటే ఫుల్ అటెండెన్స్ లేదా 80% అటెండెన్స్ ఉంటేనే రాయనిచ్చేవాళ్ళు . అందుకోసమని అందరం అటెండెన్స్ కోసం పాకులాడే వాళ్ళం.

మా క్లాసులో వైశంపాయని అని ఒక అమ్మాయి ఉండేది. తను లెక్చరర్ వచ్చిన రాకపోయినా సిన్సియర్గా క్లాసులో కూర్చుని తెలుగు పాఠం చదువుకుంటూ ఉండేది .ఎప్పుడు ఫుల్ అటెండెన్స్ తనది.

నేనూ రమా , రాజ్యలక్ష్మి , కుసుమ తెలుగు క్లాస్ కి మేడం వచ్చే ముందు క్లాస్ రూం బయట స్థంభం చాటుకి నిలబడి , ఆవిడ చేతిలో అటెండెన్స్ రిజిస్టర్ వుందా లేదా అని చూసేవాళ్ళం. వుంటే , పరిగెత్తుకుంటూ వెళ్లి బుద్ధిమంతులు లాగా కూచునే వాళ్ళం. రిజిస్టర్ లేకపోతే, క్లాస్ కి వెళ్ళే వాళ్ళం కాదు. ఇలా చాలా సార్లు జరిగింది.

ఏడాది పరీక్షలు దగ్గర కొస్తున్నాయనగా , రిజిస్టర్ తీసుకుని క్లాస్ కి వచ్చారు మా యశోదారెడ్డి మేడం.

ఆ రోజు అటెండెన్స్ తీసుకోగానే, ఇవాళ ప్రతి స్టూడెంట్ ఏడాదికి ఎన్నిసార్లు వచ్చారు , ఎన్నిసార్లు ఆబ్సెంట్ అయినారు క్యాలిక్యులేట్ చేసి దాన్ని ప్రిన్సిపల్ మేడంకి పంపిస్తాను. అటెండెన్స్ 75 -80 శాతం ఉంటేనే పరీక్ష రాయనిస్తారు. " అని చెప్పారు. అది తెలిసే క్లాస్ మొత్తం అటెండెన్స్ ఉంది ఆ రోజు.

నాకు మా ఫ్రెండ్స్ కి కొంచెం గుండెల్లో పీచు పీచు మంటోంది . ఎందుకంటే చాలా రోజులే డుమ్మా కొట్టాము . అటెండెన్స్ సరిపడనంత ఉందా లేదా ? లేకపోతే మేడంని బ్రతిమిలాడాలి అనుకుంటూ లెక్కలు వేసుకుంటూ బిక్కుబిక్కుమంటూ క్లాస్ లో కూర్చున్నాం.

కొంతమంది ఫస్ట్ బెంచ్ లో కూర్చునే వాళ్ళు మేము ప్రతి క్లాస్ అటెండ్ అయ్యాము. మాకు 100% అటెండెన్స్ వుంటుంది అని చాలా ధీమాగా వున్నారు. మేడం రాగానే కిందటి పాఠంలో తమకు అర్థం కానివి ప్రశ్నలు వేస్తూ , చాలా ఒద్దికగా కూర్చునే వాళ్ళు. అందులో "వైసంపాయిని " కూడా ఉంది. తన పేరు కొత్తగా వుండి పలకడానికి ఇబ్బంది పడేవారు అందరూ. అలా తన పేరుతో పాపులర్ అయింది. మా క్లాస్ లో అందరికీ తెలుసు వైశంపాయిని కి ఫుల్ అటెండెన్స్ వుంటుందని.

మేడం ఒక్కొక్కళ్ళ పేరు పిలిచి , మీరు సిన్సియర్ గా ఎన్నెన్ని క్లాసెస్ కి రాలేదో చెప్పండి. ఎందుకంటే , నేను కొన్నిరోజులు రిజిస్టర్ తీసుకురాలేదు. అయినా ఎవరెవరు వచ్చారో , రాలేదో మీ అందరి మొహాలు నాకు గుర్తే. మీ చేతే చెప్పిద్దామని అడుగుతున్నాను.

అన్నపూర్ణా అని పిలిచారు. " మేడం నేను అన్ని క్లాసులకు వచ్చాను" అని అంది. " మరీ అన్ని క్లాసులకు వచ్చానంటే ఎలా? అయినా అలా ఫుల్ అటెండెన్స్ వెయ్యకూడదు. రెండు రోజులు ఆబ్సెంట్ వేస్తాను." అని రెండు ఇంటూ మార్కులు పెట్టారు. మేడంను ఏమీ అనలేక , మొహం చిన్నబుచ్చుకొని కూచుంది. అలా ఇద్దరి ముగ్గురి పేర్లను చదివీ ఇలాగే చేస్తున్నారు.

నాకు భయం పట్టుకుంది. ఎన్ని రోజులు ఆబ్సెంట్ అని చెబుతామా అని లెక్కలు వేసుకుంటున్నాను.

ఇంతలో "వైశంపాయిని" అని పిలిచారు. "నేను అన్ని క్లాసులకు ప్రజెంట్ మేడం అంటూ ధీమాగా చెప్పింది"

మేడం తన వంక చూసి " లేదు నువ్వు 5 క్లాసెస్ ఆబ్సెంట్" అంటూ రిజిస్టర్ లో 5 రోజులకీ ఇంటు కొట్టింది. "వైశంపాయినీ" అయ్యో! మేడం నేను ఒక్క రోజు కూడా ఆబ్సెంట్ అవలేదు. కావాలంటే క్లాసమేట్స్ అందరినీ అడగండి" అంటూ కళ్ళ నీళ్ళ పర్యంతం అయింది. మేమందరం కూడా "అవును మేడం"అంటూ తనకి వత్తాసు పలికాము.

"ఎవ్వరూ మాట్లాడకండి. నాకన్నీ తెలుసు. అయినా 5 రోజులు ఆబ్సెంట్ అయినా , పరీక్ష కి కూచోనిస్తాము కదా! ఎందుకు ఓహో గింజుకుంటున్నావు' అంటూ కోప్పడింది.

ఇంక నా పేరు వచ్చేసరికి , "నువ్వు చాలా రోజులు ఆబ్సెంట్, ఫైన్ కడితేనే గానీ ఎగ్జామ్ రాయనివ్వను అంటారేమో! " నాన్నకి తెలిస్తే ఇంకేమన్నా ఉందా? "ఫైన్ కట్టను , క్లాసుల కి ఎందుకు వెళ్ళలేదు " అని నాన్న అంటే ఏమి చెప్పాలి? మనసులో ఒకటే అలజడి. ఇంతలో నా పేరు పిలిచారు. కానీ నా చెవులకి వినపడలేదు భయంతో. నా పక్కన ఫ్రెండ్ " నీ పేరే పిలుస్తున్నారు నుంచో" అంటూ నా చెయ్యి గిల్లింది. కంగారుగా లేచి నుంచున్నాను. క్లాస్ లో అందరి దృష్టీ నా మీదే వుంది. నేను ఎన్ని క్లాసులు డుమ్మా కొట్టానో చెబుతామని నోరు తెరిచేలోగా,"

"నువ్వు అన్ని క్లాసులు హాజరు . కూచో" అన్నారు మేడం. మూర్ఛ పోవడం నా వంతయింది.



-డాక్టర్ కేతవరపు రాజ్యశ్రీ
8500121990

## కాలం !!

ఊపిరినిచ్చి లెక్క మొదలు పెడతావు
కట్టెలకట్ట ఏదోచోట ముందే పెట్టుంచుతావు.

పేగుముడిని విప్పి స్వేచ్ఛనిస్తావు
రాగానుబంధాలతో బందించేస్తావు.

కోరికల కొట్టంలో కట్టిపడేస్తావు
ఆశల పలుపులు మెడకు చుట్టేస్తావు
కనిపించని దైవమే నీవు కాలమా !!

నడిపిస్తావు
నడిమి ముంచేస్తావు..!!

చేయూతనిస్తావు
చేయి జారవిడుస్తావు..!!

కలిసొచ్చినట్టే కనిపిస్తావు
కనికరంలేకుండా కాలరాసేస్తావు..!

సెలయేరులా బ్రతుకును పరుగెత్తిస్తావు
చివరకు కాలసంద్రంలో కలిపేస్తావు..!!
కాలమా కాదనగలమా నీ లీలలు !!


చావుపుట్టుకలే రెండు చక్రాలు
ఆరు ఋతువులే ఆరు అశ్వాలు..

చీకటి వెలుగుల త్రోవలలో..
క్షణమైనా ఆగక
యుగయుగాలను అవలీలగా దాటుకుంటూ..

తానే రథిగా సారథిగా
ప్రాణికోటిని తరలించుకుపోయే పయనమే
కాలం !!

ఎవరిని ఎటు తీసుకుపోతుందో !?
ఎవరిని ఏ దరికి చేరుస్తుందో ?!!


చెప్పకుండా సాగిపోయే గమనమే
కాలం!!




-పేరిశెట్టిబాబు
9247170800

పుస్తక సమీక్ష

# మంచిని పెంచే మంచి కథలు







ఎక్కడో ధర్మోరా (నిజామాబాద్ జిల్లా)కు చెందిన వారైనా, పొరుగు రాష్ట్రమైన మహారాష్ట్రలోని ముంబయిని నివాస స్థలంగా చేసికున్నా, సాహితీవేత్త అంబల్ల జనార్ధన్గారు తెలుగుభాష మీది మమకారం వీడలేదు. నిరక్షరాస్యురాలైన తన తల్లి అంబల్ల నర్సవ్వగారి కోరిక ప్రకారం వ్యవ ప్రయాసల కోర్చి తెలుగు నేర్చుకున్నారు. తెలుగులో కథలు వ్యాసాలు, నానీలు వ్రాయగలిగి నంతటి ప్రజ్ఞను అలవరుచుకున్నారు. అరకొర వసతులున్నా, ఆసక్తి ఉంటే అనుకున్నవి సాధించగలరని నిరూపించారు. మాతృభాషయైన తెలుగులో వ్రాయటమే కాదు, తను వ్రాసిన తెలుగు కథలను మరాఠి గుజరాతి భాషల్లోకి అనువదించగల నేర్పును సంపాదించుకున్నారు. ఉద్యోగంలో ఉండి కూడా అటు ఉద్యోగబాధ్యతలు నిర్వహిస్తూనే తెలుగు భాషామతల్లి గళాన మౌక్తిక హారాల్ని అలంకరించారు జనార్ధన్గారు. పదిమంది సంతానంలో వీరొకరైన జనార్ధన్గారికి తమ ఇంట్లోని అనుభవాలు బ్యాంకింగ్ రంగ బాధ్యతలు చక్కగా పనికి వచ్చాయి. ఈ అనుభవాలకు తన ప్రజ్ఞ జోడించి మంచి సాహిత్య విలువలు గల కథలు వ్రాస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ తెలంగాణ రాష్ట్రాలలోనే కాకుండా, ముంబాయి గుజరాత లాంటి తెలుగేతర రాష్ట్రాలలో కూడా ప్రశంసలు పురస్కారాలు పొందారు.

36 కథానికలున్న ఈ సంపుటిని పరిశీలిస్తే, జనార్ధన్గారికి కథను కథగానే చెప్పగల నేర్పు వుంది. అనవసర సాగదీతలు, అవసరానికంటే మించిన వర్ణనలు ఉండవు. చెప్పాల్సిన విషయాన్ని బట్టి 2,3 పేజీల్లో ముగిస్తారు. గరళకంఠుడు బిగ్బాసూ-హడావిడిరావు, నాన్నలంతా ఒకటేనా కథలు ఉదాహరణగా చెప్పుకోవచ్చును.సమాజానికి తనవంతు సాయం చేయాలన్న 'ఉడుతసాయం', హమ్మయ్య స్థిరపడ్డాను' లాంటి కథల్లో అవసరాన్ని బట్టి పది పేజీల దాకా పొడిగించారు రచయిత. ప్రాదేశిక అవసరాలను బట్టి తెలంగాణా మాండలికం వాడుతారు (ఉడుతసాయం) కరోనా కష్టకాలం ప్రపంచాన్ని ఎలా కుదిపివేసింది మన అందరికీ అనుభవమే! ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో కూడా ధైర్యాన్ని కోల్పోవద్దని ఏదో రకంగా ఓపిక ఉంటే జీవనోపాధి సాధించుకోగలమని చెబుతారు. ప్రార్థించే పెదవులకన్నా కథలో. ధనాన్ని కూడ బెట్టటం పరమావధి కాదని దాన్ని జనసేవకై ఉపయోగించాలన్న మానవతా సందేశం మహత్తరమైనది. 'ఆ రెండు నెలలు' కథకూడా నిబ్బరంతో కరోనాను ఎదుర్కోవాలన్న మానవతావాద సందేశం ఇస్తుంది. చీకటిని తిట్టుకుంటూ కూర్చునేబదులు ఎంత చిన్నదీపమైన వెలిగించ మన్న ఆశావాదాన్ని మేలుకొలుపు తుంది.

తప్పు చేయవద్దు. తప్పుచేస్తే శిక్ష తప్పకపడుతుంది. చిన్న పిల్లలను ఎత్తుకొచ్చి అంగవైకల్యులుగా మార్చి అడుక్కునేలా చేసి సంపాదించే బాస్కి భగవంతుడు ఈ జన్మలోనే శిక్ష-తన తమ్ముని పిల్లలే బలికావటంపడింది. ప్రాయశ్చి తంగా 'దివ్యాంగ్ నికేతన్' దివ్యాంగు లకు ఆశ్రయం ఇప్పించి జనార్ధన్గారు మంచి సందేశం ఇచ్చారు.

వీరి కథలుకు ఇచ్చిన శీర్షికలు, పాత్రల స్వభావాన్ని బట్టి పాత్రలకు ఆపేరు పెట్టటం రచయిత చేసిన గొప్ప ప్రయోగం. పారేనది నిశ్చలమైనకొండ. చంచల మనస్కుడు చంచల రావు. నిదానం ప్రధానమనే కూర్మమూర్తి. 'నది-కొండ'లో మనకు కనిపిస్తాయి. కేన్సర్తో కొద్ది రోజుల్లోనే పోయే గరళకంఠుడు (పాత్ర పేరు). తోటి వారితో నవ్వుతూ తుళ్ళుతూ మాట్లాడుతాడు. కథ చదివాక మన కళ్ళలో కూడా చెమ్మ ఊరి నిశ్శబ్దులమైపోతాము. హాస్యం, కొస మెరుపు, కరుణలు కొన్ని కొన్ని కథల్లో చిప్పిలుతాయి. వయసు శరీరానికే కాని మనసుకు కాదని గ్రీష్మంలో వసంతం కథ చెబుతంది. 60 ఏళ్ల పెళ్ళి పండుగ ద్వారా ఈ కథలో ఇచ్చిన సందేశానికి మనసు చెమ్మగిల్లుతుంది.

'దేహదాహం' 'పంచతారాంకిత హొటళ్ళు' (5 నక్షత్రాల హొటళ్ళు) 'తీగ మీటితే డొంకంతా కదలటం', 'చీకటి సొరంగం చివర వెలుగు పురివిప్పటం', 'గరుజుకు అక్కల్ లేదు', 'ముందాటున్నోడికి మూతి పండ్లు రాల్తయి', 'నడుంద్రి పల్లెల లగ్గం సూద్దాం' లాంటి పదాల ప్రయోగం రచయితకు భాషమీదున్న ప్రేమ వ్యక్తమౌతుంది. చివర చెప్పిన ఈ కథ పాఠకులను 50 ఏళ్లు వెనక్కి తీసుకువెళ్ళి నాటి పెళ్ళిళ్ళలోని సంరంభం తెలుపుతుంది. నేటి సీనియర్ సిటీజన్లు ఈ కథతో తమ అనుభవాల్ని పోల్చి చూసుకుంటారు. నేటి యువకులకు నాడు పెళ్ళిళ్ళు ఎలా జరిగేవో తెలుపుతుంది ఈ కథ.

ముఖచిత్రం (అట్టమీది బొమ్మ)లో పట్టణానికి పల్లెకు వారధిలా తన కలాన్ని ఉంచి గొప్ప సందేశమిచ్చారు.

అటు పాఠక రచయితలు, ఇటు పాఠకులు తమను తాము ఈ కథల్లో చూసుకోగలిగినంత సహజంగా తీర్చిదిద్దబడ్డాయి కథలు.

జనార్ధన్గారూ! మీకు అభినందనలు. మీరు ముందు ముందు ఇంకా మంచి కథలు ఇలా అందిస్తూనే ఉండాలి.

**ప్రతులకు:**
డా॥ అంబల్ల జనార్ధన్
సెల్:8850349858
మరియు అన్ని
పుస్తక కేంద్రాలలో



- కూర చిదంబరం
సెల్: 8639338675

## ఆమె అడిగింది

నల్గురం కూర్చుని
నువ్వుకుంటున్న వేళ
ఆమె అడిగింది...
మీరు లవ్ ఫెయిల్యూరా...అని.

సమాధానంగా
చిరునవ్వు వెలుగుతూనే వుంది.

మీ అనుభవాలు చెప్పండి...
ఇటునుంచి ఓ ప్రశ్న...
నన్నడిగితే
ఎవరి అనుభవాలు వారివి.

ప్రశ్నించడానికి
మీలో ఉత్సాహం ఉన్నా
జ్ఞాపకాలు వివరించలేని మౌనం
విస్తుపోయింది.

ప్రేమించకపోవటం నేరమా
మరో ప్రశ్న..
ప్రేమించటం పాపమా
ఇంకో ప్రశ్న...

రెండింటిలోనూ తప్పు లేదు
అలా అని సాధారణీకరణం చేయలేను.

ఆయినా వాస్తవంలోకి తొంగి చూస్తే
కొన్ని ప్రేమలు ఆస్తులు చూస్తాయి
కొన్ని ప్రేమలు అవసరాలు చూస్తాయి
కొన్ని ప్రేమలు
భద్రతలు వెతుక్కుంటాయి
కొన్ని ప్రేమలు
ఆకర్షణలుగా మిగిలిపోతాయి
కొన్ని ప్రేమలు అతుక్కుపోతాయి.

ఇన్ని ముచ్చటైన క్షణాల్లో
ఇప్పుడు ప్రేమగూర్చి మాట్లాడటం కంటే
దొరికిన క్షణాల్ని
బహు ఆనందం గా
మీతో పంచుకుంటున్నాను.
ఈ సమాధానం సందడైంది...



-గవిడి శ్రీనివాస్
7019278368,
9966550601

## చివరి లేఖ

అమ్మ నాన్నకి ప్రేమతో
ఏదో రాయాలనుకున్నాను
కాని రాయడం కూడా చేత కావట్లేదు
ఎందుకో కాగితం కూడా
కన్నీటితో తడిసి ముద్దయింది నాలాగే
దేవుడు ఉన్నాడో లేదో నాకు తెలియదు
దయాజాలి అవి ఎక్కడ ఉంటాయో తెలియదు
ఏడు అడుగులు నడిచానో లేదో
ఏడు నెలలు తిరగకుండానే
ఏడు జన్మల నరకం చూశాను...వాడితో..

మీరు నమ్మిండ్లు
నేను అంతకన్న ఎక్కువ నమ్మాను
చేయి పట్టి నడిచిన వాడే చెర్నాకోలా అయ్యాడు
ఆదరించాల్సిన అత్తమామలే అగ్గి మంటలైనారు
ఇక ఆడబిడ్డ ఆరాళ్ళు అన్నీ ఇన్నీ కావు.

నా మొగుడు! ఓ మృగం
గుండా ... బండ వాడిని దేనితో పోల్చలేము
అందుకు కొన్ని నిదర్శనాలు
పంటి గాట్లు పడాల్సిన నా పెదాలపై కత్తిగాట్లు
సహస్రాల్లో పొదువుకోవాల్సిన ఒంటిపై సిగరెట్ గాట్లు
నాన్న! నీ నెత్తురు అంతా నోట్లు చేసి ఇచ్చిన డబ్బు
బ్రాందీ షాప్ లో లిక్కర్ అవుతుంది
మీరు ప్రేమగా ఇచ్చిన ప్రతి వస్తువు
అత్త ఆడబిడ్డల విలాస వస్తువులయ్యాయి

నాన్న!నువ్వు చెప్పిన
హితబోధలన్నీ చెప్పా వాడికి
నీతిమాలిన ఈ లోకంలో...
నీతి కథలు ఎవరిని మార్చలేకపోతున్నాయి.

నాన్న! నేను ఒక్కదాన్ని
మగపిల్లాడినైనా బాగుండు
అన్నయ్యలా హాయిగా చదువుకునేవాన్ని
అసలు నన్ను ఎందుకు పుట్టించాడో దేవుడు
పుట్టింట్లో ఎంత ప్రేమగా చూసుకున్నారు
నేను పుట్టగానే మహాలక్ష్మి పుట్టిందన్నారు
అదేంటో మెట్టింటోళ్లు దరిద్రం
నా రూపంలో వచ్చిందని ఆడిపోస్తున్నారు
మనుషుల్లో కూడా రాక్షసులు ఉంటారని
ఇప్పుడే అవగతం అయింది.

నాన్న ప్లీజ్! అమ్మకి చెప్పు
నేను చచ్చిపోతే ఏడవ వద్దని
లోకంలో అందరి భర్తలు ఒకలా ఉండరన్న
లోకరీతి తత్వాన్ని చెప్పి ఓదార్చు
పాపం పిచ్చి తల్లి గుండె పగిలేలా ఏడుస్తుంది.

ఏ జన్మ పాపమో ఈ నరకం
ఇక నేను భరించలేను
వేదమంత్రాలు....నాథ తంత్రులు...
ప్రమాణాలు అన్నీ బూటకం అని
భార్యాభర్తల బంధం ఒక నాటకమని
ఇప్పుడే తెలిసింది
పుట్టింటికి రాలేను మెట్టింట్లో నిలవలేను
అందుకే నా జ్ఞాపకాలైన చివరిసారి మీతో
పంచుకోవాలని నెమరు వేసుకుంటూ
నా స్వదస్తూరితో
రాస్తున్న ఈ చివరి లేఖ



-వజ్జీరు ప్రదీప్,
9989862991

## విపరీత బుద్ధి

చెట్టు మీద కట్టి చిన్నారి పొదరిల్లు
చిత్రమైన రీతి చెందె ఖ్యాతి
నీడనిచ్చు తల్లి నిలువునా చీల్చి
వాడుకొనెడు వాడు కాడు నరుడు.!
చెట్ట పట్టాలేసి చెట్టుమీదింటిలో
చెలిమి చేయు జంటలెక్కువవగ
విందు వినోదాలు విలసిల్లగాను
పెరిగిన తరువులు తరిగి పోవా.!?

నీడనిచ్చు నీకు ప్రాణవాయువునిచ్చు
వాననిచ్చు నీకు వరహాలనిచ్చు
ఎన్ని ఇచ్చిన గూడ ఏమి నిన్నడగదు
ఎందుకయ్యా చెట్టు మీద నీ బెట్టు.?
వీలుంటే ఒక చిన్న మొక్కను నాటు
ఇకముందు వేయకు చెట్టుపై వేటు
విపరీత బుద్ధితో అపరాధమేలరా
వనదేవతకు మొక్కి బుద్ధిగా మసలుకో!



-పెసరు లింగారెడ్డి ,
9010292500

## 48.5 సెంటిగ్రేడ్

ఉదయిస్తూనే
నిప్పుల వాన
చిలికి చిలికి ఉగ్ర మార్తాండ రూపం
చల్లబడ్డది ఎప్పుడూ
పగలు రాత్రంతా యుద్ధం వాతావరణం
అగ్నిగుండంలో బొర్లించినట్లు వేసవి బతుకు.

చెట్టు నీడన
అల్ప ప్రాణులు పంచ ప్రాణాలను
ఎట్లా నిలుపుకుంటున్నాయో..

రెమెడీస్ లేకుండా!
భూమాత ఆయుష్షు క్షీణించడానికి
కారణమెవ్వడు 'మానవ'?!

చలికి వానకు ఓర్చుకున్న దేహం
ఎండను తట్టుకోలేక
తలంటుకున్నట్లు తల్లడమల్లడం
మంగళంలో మక్కపేలాలు వేయించినట్లు!
కాంక్రీట్ సౌధాలు
కట్టెల పొయ్యి మండినట్లే.
నంటింట్లో అరికాళ్ళు అంటుకుంటున్నాయి
నిండు వేసవిలో బతికి బట్టకడితే
ఏ కాలంలోనైనా పుట్టినరోజు జరుపుకోవచ్చు!

కూలర్ నీకు దండంపెడతా
ఏసీ నీకాళ్ళ మొక్కుతా
మీరే మా ప్రాణ రక్షకులు
మండే వేసవిలో
తల దాచుకోవడానికి శీతల శిబిరాలు
కాలాన్ని బట్టి హామీల డిమాండ్.

నీ ప్రమేయం లేకుండా
పుట్టుక తేలికైనట్లనిపించినా..
మంచిగా బతకడంపెను సవాల్
ఎవడు ఊరికి పైకి పోడు
సమయం వచ్చినప్పుడు
కాలమే వెలకట్టే లాక్కెళ్తుంది
అప్రమత్తత అత్యావశ్యకం.

మా మేనత్తన్నట్లు
పుట్టినప్పుడే
ఎవని అంతిమ ఘడియ
వాని నొసటి మీద లిఖించబడుతుందని
వానికి తెల్వదు
చెబుదామంటే
ఎదుటి వారికి అర్థం కాదు!



- జిందం అశోక్
సెల్: 8978532225

## అదిగో

నల్లటి చీకటి పలకలాంటి మేఘం మీద
చూపుడు వేలుతో
అక్షరం రాసిందు-
ఎప్పుడో నెత్తుటి మడుగులో ఒడ్డుమీద చేపపిల్లలా
కొన ఊపిరిలో గిలగిల కొట్టుకుంటున్న
బొటన వేలు అన్వేషణకు..
అక్షరం దారి దీపం అయింది-
వేళ్లు ఆనవాళ్లు దొరకలేదు
కుట్రదారిడి జాడ దొరికింది
ఎన్నో చేతుల వేళ్లు వేల పిడికిల సూర్య తోటకు
మాలి దొరికిందు
నిషేధ మట్టికి కొత్త జెండా దొరికింది-
ఇప్పుడు
నింగి తాకిన నిలువెత్తు జ్ఞానరూపం
దేశం నడిబొడ్డు మీద నాలుగు దిక్కులా
వెలుగు వికసించిన
విశ్వాంతర క్రాంతి
అదిగో అంబేద్కర్.



- జనజ్వాల
సెల్: 9949163770

## అనురాగ సిరి

చెట్టమ్మ చెట్టమ్మ చెట్టమ్మా
నీ చెలిమంటె మాకెంతొముద్దమ్మా
ఆత్మగల్ల జన్మ నీదమ్మా.ఈ
యవనికె అనురాగ సిరివమ్మా.
సీతనోదార్చావు మాతవై
జ్ఞాన మోక్షమందించావు బుద్ధివై
నీ తనువునే తరిగి వేసినా
నీ కొమ్మనే కొట్టివేసినా
గంధమై పూస్తావు చల్లంగా
అనుబంధాన్ని పంచేవు అందంగా
జమ్మిచెట్టువై విజయాలు మాకిస్తు
జన్మంత మాతోడు వెన్నంటి నడిచేవు
నీ వేరే ఔషధం..నీ శ్వాసే మా బలం
నీవు లేకపోతే లోకమే శూన్యం.
వృక్షమా నీ బుద్ధి బంగారం
అది మానవానుదుటికే సింగారం
నీ నిలువెల్లా-అనురాగమే
నీ తలపంతా సమభావమే
కొబ్బరి కాయల్తో కొంగు బంగారమై
కొత్తశక్తి నింపి కోర్కెలీడేర్చేవు
కాలచక్ర గతికి కళలెన్నో చేకూర్చి
మానవ ప్రగతికే మార్గాన్ని దిద్దేవు
పంచశక్తులున్న ప్రణవ స్వరూపిణి
పరమాత్మ;బిడ్డవు పరహిత వరదాయి!
ఆకుపచ్చని కాంతి మాగాణం..
తెలగాణ ప్రగతికే తార్కాణం
నీతిగా మొక్క నాటగా
నియమంగా పెద్దజేయగా
దీక్షగా రక్షగా-వృక్షాలను బెంచ
అక్షయంబుగ మన కుక్షి బాధలుతీరు
పల్లె పట్నాలలో బాధ్యతగ మనమంత
ఆకుపచ్చని చెట్టు నెత్తి కొక్కటి పెంచ
నేల ఈనినట్లు కోట్ల మొక్కలజూచి
వానదేవుడె వచ్చి
చిటపటా మాట్లాడు.



-డా.పాండాల మహేశ్వర్
9912180054

## చెరువు గట్టు

అటుపక్క పొలం
ఇటుపక్క జలం
ఆచుట్టూ వనం
మనసంతా నిర్మలం!!.

చెరువులోని చేపపిల్ల
ఎగిరెగిరి ఎండను చూస్తుంది!
తళతళ మంటూ తాబేలు
అడుగంటూ అన్వేషిస్తుంది!!.

ఒంటికాలున కొంగ
దొంగ జపం చేస్తుంది!
గగనాన గద్ద
తన్నుక పోను చూస్తుంది!!.

వేటగాడి చేతిలో
వొళ్ళంతా కళ్ళు చేసుక
చూస్తున్న వల!
పొడవాటి కర్రకు
వేళ్ళాడుతున్న ఎర!!

ఈ రోజు ఎవరిదో
వేటగాడిదా!
వేటు తప్పించుకునే
చేపదా!!



-జగ్గయ్య.జి
9849525802

సాహితీ వరేణ్యులు-2

## ఆచార్య ఎన్.గోపికి ప్రొ॥ కొత్తపల్లి జయశంకర్ విశిష్ట పురస్కార ప్రదానం







హైదరాబాద్, జూన్ 21: హైదరాబాద్ అబిడ్స్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్తులో భారత జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత అధ్యక్షతన తెలంగాణ సాహిత్య సభలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆచార్య ఎన్ గోపికి ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ విశిష్ట సాహితీ పురస్కారం-2023ను ఎమ్మెల్సీ కవిత అందించి సత్కరించారు.

ఈ కార్యక్రమంలో డాక్టర్ నందిని సిధారెడ్డి, డాక్టర్ గోరేటి వెంకన్న, డాక్టర్ తిరునగరి దేవకిదేవి, డాక్టర్ గోగు శ్యామల, నమస్తే తెలంగాణ దినపత్రిక ఎడిటర్ తిగుళ్ల కృష్ణమూర్తి, డాక్టర్ ఏనుగు నరసింహ రెడ్డి, డా॥ నాళేశ్వరం శంకరం, ఘనపురం దేవేందర్ పలువురు ప్రముఖ కవులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం సాధించుకోవడం ఎంత ముఖ్యమో మన సంస్కృతి, సంప్రదాయాలు కాపాడుకోవాలని జాగృతి ఉద్యమం చేసిందని గుర్తు చేశారు. ప్రతి సంవత్సరం సాహిత్య సభలు జరపాలని ఈ కార్యక్రమం రూపొందించామని తెలిపారు. రెండు రోజుల పాటు కొనసాగే ఈ సాహిత్య సభల్లో అన్ని అంశాల మీద కూలంకషంగా చర్చలు జరుగుతాయన్నారు.

రాష్ట్రం ఏర్పడిన తర్వాత తెలుగు మహాసభలు ఘనంగా నిర్వహించుకున్నామని గుర్తు చేశారు. అందరిని భాగస్వామ్యం చేస్తూ ఈ సాహిత్య సభలు విజయవంతం చేసుకుందాం అని చెప్పారు. ఎవరి భాష వారికుంటది.. ఇదే మాట్లాడాలి అని అంటే తీవ్రంగా వ్యతిరేకిస్తామన్నారు. తెలంగాణ జాగృతి దేశంలో ఉన్న ప్రజలను జాగృతం చేసేందుకు భారత జాగృతిగా రూపుదిద్దుకుందని ఎమ్మెల్సీ కవిత తెలిపారు.

# తెలుగు కవితా శిఖరం డాక్టర్ ఎన్.గోపి

సుప్రసిద్ధ లబ్ధప్రతిష్ట కవి, పరిశోధకులు, విమర్శకులు, తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేస్తున్న కవితాశిఖరం డాక్టర్ ఎన్.గోపి. అగ్రశ్రేణి కవిగా, రచయితగా, విమర్శకులుగా, సాహిత్యవేత్తగా, అనువాదకులుగా, పరిశోధకులుగా, వ్యాఖ్యాతగా, పాఠ్య గ్రంథ రచయితగా, కాలమిస్ట్ గా, ఆచార్యులుగా బహుముఖీన ప్రతిభ గోపి సొంతం. కవిత్వమే జీవనవాహినిగా తరిస్తున్న కవితాఝురి గోపి. ప్రసిద్ధ కవి, సినీ గేయ రచయిత సినారె స్ఫూర్తితో కవితారంగేట్రం చేసిన గోపి తెలుగు సాహిత్యంలో బలమైన ముద్రను వేసిన కవన మూర్తి. నేటి యువకవులతో పోటీపడుతూ నిత్యం కవితాత్మను పంచుతున్న క్రియాశీలి. కవిత్వమే జీవితంగా శ్వాసిస్తున్న అక్షరకేతనం గోపి. ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖాధ్యక్షులుగా, ఆర్ట్స్ కళాశాల డీన్ గా పనిచేసిన కార్యదక్షులు. తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులుగా పనిచేసి విశ్వవిద్యాలయం గౌరవాన్ని ఇనుమడింపచేసిన ప్రతిభామూర్తి. ప్రసిద్ధ కేంద్ర సాహిత్య అకాడమి అవార్డును పొందిన అనర్ఘరత్నం.

### బాల్యం - విద్య

యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో నక్క లక్ష్మమ్మ, చెన్నయ్య దంపతులకు 25 జూన్ 1948 సంవత్సరంలో ఎన్. గోపి జన్మించారు. భువనగిరిలోనే ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రాథమిక విద్యను అభ్యసించి ఉన్నత విద్య ను హైదరాబాద్ లో పూర్తి చేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాలలో సంస్కృతం మరియు భాషాశాస్త్ర సమూహంతో (బి.ఎ.) తెలుగు చదివారు. ఇందులో 6 వ ర్యాంక్ సాధించి నిజాం బంగారు పతకాన్ని గెలుచుకున్నారు. అనంతరం అదే విశ్వవిద్యాలయంలో తెలుగు భాష మీద అభిమానంతో తెలుగు ఎం.ఎ. పూర్తి చేశారు. 1973 సంవత్సరంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి గురజాడ అప్పారావు గోల్డ్ మెడల్ సాధించి విశ్వవిద్యాలయంలో అగ్రస్థానంలో నిలిచారు.

ఆ తర్వాత అప్లైడ్ లింగ్విస్టిక్స్‌లో పీజీ డిప్లొమా చేశారు.

### ఉద్యోగ జీవితం

ఐక్యరాజ్య సమితి ప్రధాన విభాగమైన యునిసెఫ్ లో నాన్ ఫార్మల్ ప్రాజెక్ట్‌లో ప్రాజెక్ట్ ఆఫీసర్ గా గోపి ఒక సంవత్సరం పాటు పనిచేశారు. ఈ ప్రాజెక్టు అంతా పాలమూరు జిల్లాలో కొనసాగింది. ఆ తర్వాత 1974 సంవత్సరంలో ఉస్మానియా విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉన్న ఎన్. బి సైన్స్ కాలేజీలో లెక్చరర్‌గా చేరారు. అనంతరం 1981 సంవత్సరంలో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలుగు శాఖలో చేరారు. 1990 సంవత్సరంలో తెలుగు ప్రొఫెసర్ గా, 1992 సంవత్సరంలో బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా, 1994 సంవత్సర ంలో డిపార్ట్‌మెంట్ హెడ్‌గా బాధ్యతలు చేపట్టారు. 1999 - 2002 సంవత్సరంలో తెలుగు విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ గా నియమితులయ్యారు. ఈ పదవికి ఎంపికైన గోపి భారతదేశంలోనే అత్యంత పిన్నవయస్కుడైన వైస్ ఛాన్సలర్ కావడం విశేషం. తెలుగు విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ గా ఉండగానే 2001 సంవత్సరంలో ద్రవిడ మరియు కాకతీయ విశ్వవిద్యాలయాలకు తాత్కాలిక వైస్ ఛాన్సలర్ గా అదనపు బాధ్యతలను ఏకకాలంలో నిర్వహించారు. తెలుగు వైస్ ఛాన్సలర్ గా పదవీకాలం పూర్తయిన తర్వాత తిరిగి తన మాతృ విశ్వవిద్యాలయమైన ఉస్మానియా విశ్వవిద్యాలయానికి తిరిగి వచ్చారు. ఇక్కడ ఉండగానే గోపి డీన్ గా ఫ్యాకల్టీ ఆఫ్ ఆర్ట్స్ 2004 - 2006 సంవత్సరం కాలంలో పనిచేశారు. అనంతరం 2008 సంవత్సరంలో పదవీ విరమణ చేశారు. తర్వాత 2011-13 మరియు 2015- 17లో రెండవసారి యు.జి.సి. ఎమిరిటస్ ఫెలోగా పనిచేయడం విశేషం.

### కుటుంబం

డా.ఎన్.గోపి బోధన్ కు చెందిన ఎన్.అరుణను పెళ్ళి చేసుకున్నారు. అరుణ కవయిత్రిగా ఎనిమిది కవితా సంపుటాలను వెలువరించారు. వీరి కుమారుడు చైతన్య ఉన్నతోద్యోగం చేస్తున్నారు.

### రచనలు

తెలుగు కవితా మాగాణాన్ని సుసంపన్నం చేస్తున్న గోపి నిత్యం కవిత రాయనిదే నిద్రపోవడం కద్దు. నిరంతరం అక్షరాలతో సహవాసం చేస్తూ కవితాపంటను పండిస్తున్న సేద్యకవి. ఒకపక్క కవిత్వం రాస్తూ మరోపక్క బలమైన విమర్శనా త్మకమైన వ్యాసాలను రాస్తున్న పరిశోధక శిఖామణి. డాక్టర్ ఎన్. గోపి ఇప్పటివరకు 26 కవితా సంపుటాలు, 7 వ్యాస సంపుటాలను, 3 పరిశోధనా రచనలను, 6 యాత్రా చరిత్రలను, 5 అనువాద గ్రంథాలను, 2 వ్యాఖ్యాన గ్రంథాలను, 4 కాలమ్ రైటింగ్ లతో

సహా 56 కి పైగా పుస్తకాలను ప్రచురించిన సాహితీ మూర్తి. గోపి రాసిన తొలి కవిత ాసంపుటి “తంగేడుపూలు”. ఇది 1976 సంవత్సరంలో వెలువడింది. రాసిన తొలి కవితాసంపుటికే దేవులపల్లి కృష్ణశాస్త్రి పురస్కారం పొందడం




‘మార్చి 1991లో ‘కాలాన్ని నిద్రపోనివ్వను’ పుస్తకావిష్కరణలో డా॥సి. నారాయణరెడ్డి, శీలావి, ఎన్.గోపి తదితరులు.

విశేషం. తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించిన కావ్యమి ది. ఆ తర్వాత 1982 సంవత్సరంలో “మైలురాయి”, 1989 సంవత్సరంలో చిత్రదీపాలు, 1993 సంవత్సరంలో “వంతెన”, 1998 సంవత్సరంలో “కాలాన్ని నిద్రపోని వ్వను, నానీలు “ కవితాసంపుటాలను వెలువరించారు. “కాలాన్ని నిద్రపో నివ్వను” కవితాసంపుటికి కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు లభించింది. “నానీలు” ఖండాంతర భాషల్లోకి అనువాదమై ప్రఖ్యాతి గాంచాయి. 2000 సంవత్సరంలో “చుట్టకుదురు”, 2002 సంవత్సరంలో “ఎండపొడ, జలగీతం (దీర్ఘకావ్యం), గోపి నానీలు వెలువరించారు. “ జలగీతం “ దీర్ఘ కావ్యం గోపిని జాతీయ కవిగా మార్చింది. ఇది పదకొండు భాషలలోకి అనువాదమైంది. 2004 సంవత్సరంలో వెలువడిన “ మరో ఆకాశం “ కవితాసంపుటి గోపి ఇంగ్లాండ్ పర్యటనలో ఉండగా రాసింది. 2005 సంవత్సరంలో “ అక్షరాల్లో దగ్ధమై “,

2007 సంవత్సరంలో “ దీపం ఒక ఏకాంతం “ కవితాసంపుటాలు వెలువడ్డాయి. 2008 సంవత్సరంలో రాసిన “ గోవాలో సముద్రం “ కవితాసంపుటి గోవాలోని సముద్రం గురించి రాసిన కావ్యం. 2009 సంవత్సరంలో వెలువడిన “ మా ఊరు మహాకావ్యం” కవితాసంపుటి మానవ సంబంధాలను ఆవిష్కరించిన కావ్యం. 2010 సంవత్సరంలో “ రాతి కెరటాలు “, 2013 సంవత్సరంలో “ హృదయ రశ్మి”, 2014 సంవత్సరంలో “మళ్ళీ విత్తనంలోకి”, 2015 సంవత్సరంలో “పురి విప్పిన ఊపిరి”, 2016 సంవత్సరంలో “ ఆకాశంలో మట్టి”, 2017 సంవత్సరంలో “జీవన భాష”, 2018 సంవత్సరంలో “ ఎవరి దుఃఖమో అది “, 2019 సంవత్సరంలో “ చైనా పద్యాలు, వృద్ధోపనిషత్ “ లను వెలువరించారు. ప్రపంచాన్ని భయభ్రాంతులకు గురిచేసిన కరోనా గురించి 2020 సంవత్సరంలో “ ప్రపంచీ కరోనా “ కవితాసంపుటిని వెలువరించారు. అలాగే 2021 సంవత్సరంలో “ మనిషిని కలిసినట్టుండాలి “, 2023 సంవత్సరంలో “ క్రియ ఒక జీవనలయ “ వంటి కవితాసంపుటాలను రచించారు. గోపి రచించిన 24 కవితా సంపుటాలలో మానవుని సంవేదన, సమాజ సంఘర్షణ, లోకరీతి వంటి అంశాలే కాకుండా తన కంటికి కనిపించిన ప్రతి వస్తువును కవితాత్మకం చేశారు. అది అతిచిన్న గుండుసూదే కావచ్చు. గుచ్చితే ఎలా ఉంటుందో తెలుసు. ఆటంబాంబే కావచ్చు. పేలితే ఎంత విస్ఫోటనమో తెలుసు. గోపి అక్షరాలు అలాంటివి. కొన్ని సున్నితంగా హెచ్చరిస్తాయి. మరికొన్ని మందలిస్తా యి. ఇంకొన్ని ఆత్మీయంగా పలకరిస్తా యి. నేటి తెలుగు సాహిత్యంలో సీరియస్ గా కవిత్వం రాస్తున్న అతికొద్దిమంది కవులలో గోపి ఒకరు. నిరంతరంగా అక్షరయానం చేస్తూ ఐదు దశాబ్దాలుగా తెలుగు కవిత్వాన్ని సారస్వతం చేస్తున్న అక్షర శ్రామికుడు గోపి.

### ఇతర భాషల్లోకి గోపి రచనలు

డాక్టర్ ఎన్. గోపి రచనలు భారతీయ భాషల్లోకే కాకుండా ప్రపంచభాషల్లోకి అనువాదవయ్యాయి. భారతీయ భాషలైన హిందీ, తమిళం, గుజరాతీ, మలయాళం, మరాఠీ, కొంకణి, డోగ్రీ, మైథిలి, కన్నడ, పంజాబీ, సంస్కృతం, ఒరియా, సింధీ, ఉర్దూ, అస్సామీ, మైతేయి, బెంగాలీ, బోడో, కాశ్మీరీ, సంతాలి, రాజస్థానీ వంటి భాషల్లోకి అనువదించబడ్డాయి. ప్రపంచ భాషలైన జర్మన్, రష్యన్, పర్షియన్, ఇంగ్లీష్, నేపాలీ వంటి భాషలలోకి అనువాదమయ్యాయి. ఆధునిక కవితా యుగంలో అత్యధిక భాషల్లోకి అనువాదమైన ఏకైక కవిగా డాక్టర్ ఎన్.గోపి తెలుగు సాహిత్య చరిత్రలో నిలుస్తారు.

### కవిత్వంలో ట్రెండ్ సృష్టించిన కవి

ఆధునిక తెలుగు సాహిత్యంలో కవిత్వం కొత్త పుంతలు తొక్కుతున్నది. గురజాడ అప్పారావు ముత్యాలసరాలు మినీ కవిత్వం పురుడుపోసుకున్నది. ఆ తర్వాత ఎన్. గోపి “నానీలు” అనే మినీ కవితారూపాన్ని ఆవిష్కరించారు. 1998 సంవత్సరంలో పురుడు పోసుకున్న నానీలు తెలుగు సాహిత్యంలో కొత్త ట్రెండ్ ను సృష్టించింది. ఎంతోమంది యువకవుల నుంచి పేరుమోసిన కవులదాకా ఈ నానీలను రచించడం విశేషం. ఇప్పటివరకు వందలాది మంది కవులు 300 కు పైగా నానీల పుస్తకాలను వెలువరించారు. గోపి నానీలు రష్యన్ భాషతో పాటు 12 భాషలలోకి అనువదించబడ్డాయి.

### బాధ్యతలు

డాక్టర్ ఎన్.గోపి పలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలోని సాహిత్య, సాంస్కృతిక రంగాలలో సభ్యులుగా నియమితులయ్యారు. 1984 సంవత్సరంలో



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాహిత్య అకాడమి సభ్యులుగా పనిచేశారు. 2003 - 2008 సంవత్సరంలో కేంద్ర సాహిత్య అకాడమి తెలుగు సలహా మండలి సభ్యులుగా, 2006 సంవత్సరంలో ఇండియా నేషనల్ బుక్ ట్రస్ట్ ఆఫ్, న్యూఢిల్లీ తెలుగు సలహా మండలి సభ్యులుగా కొనసాగారు. 1996 సంవత్సరంలో ఫీచర్ ఫిల్మ్స్, నంది అవార్డుల కమిటీ జ్యూరీ సభ్యులుగా, 2011 సంవత్సరంలో టీవీ నంది అవార్డుల కమిటీ జ్యూరీ చైర్మన్ గా, 2013 - 2018 సంవత్సరంలో కేంద్ర సాహిత్య అకాడమి కార్యనిర్వా హక మండలి సభ్యులుగా, తెలుగు సలహా మండలి కన్వీనర్ గా కొనసాగారు. అలాగే పలు స్వచ్ఛంద సంస్థలలో వివిధ హోదాల్లో తగిన గౌరవాన్ని పొందారు.

### పురస్కారాలు

డాక్టర్ ఎన్.గోపి రాష్ట్రస్థాయి పురస్కారాలే కాకుండా జాతీయస్థాయి పురస్కారాలను అందుకున్నారు. గోపి తొలి కవితాసంపుటి “తంగెడుపూలు” పుస్తకానికి 1980 సంవత్సరంలో దేవులపల్లి కృష్ణశాస్త్రి అవార్డు,



కుటుంబ సభ్యులతో...

“మైలురాయి” కవితాసంపుటికి 1982 సంవత్సరంలో ఫీవర్స్ ఫ్రంట్ పురస్కారం, తెలుగు విశ్వవిద్యాలయం ధర్మనిధి పురస్కారం, “చిత్రదీపాలు” కవితాసంపుటికి సినారె కవితా పురస్కారం, 1991 సంవత్సరం లో “చిత్రదీపాలు” కవితాసంపుటికి తెలుగు విశ్వవిద్యాలయం ఉత్తమ కవితాసంపుటి బహుమతి, 1999 సంవత్సరంలో తెలుగు అకాడమి అవార్డు, 2001 సంవత్సరంలో యునైటెడ్ చికాగో స్టేట్స్ అవార్డు, 2006 సంవత్సరానికి సనాతన ధర్మ ఛారిటబుల్ ట్రస్ట్ వారి శివానంద ఉత్తమ సిటిజన్ అవార్డ్, 2009 సంవత్సరంలో ఆంధ్రప్ర దేశ్ ప్రభుత్వ కళారత్న పురస్కారం, 2017 సంవత్సరంలో తెలంగాణ ప్రభుత్వ దాశరథి సాహిత్య పురస్కారం, 2023 సంవత్సరానికి భారత జాగృతి మొట్టమొదటిసారిగా ప్రవేశపెట్టిన ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ విశిష్ట సాహితీ పురస్కారాన్ని జూన్ 21 మంగళవారం 2023న అందుకున్నారు. ఇవేకాకుండా పలు సాహిత్య సంస్థలచే ముప్పైకి పైగా పురస్కారాలను అందుకున్నారు.

### సాహిత్య విమర్శ గ్రంథాలు

ఆచార్య ఎన్.గోపి విమర్శనాత్మకమైన రచనలు చేశారు. ఒక పక్క కవిగాతెలుగు సాహిత్యాన్ని ఏలుతూనే మరోపక్క విమర్శకులుగా తన కలం కరవాలాన్ని ఝళిపించారు. 1986 సంవత్సరంలో ‘వ్యాస నవమి’, 1992 సంవత్సరంలో ‘గవాక్షం’, ‘నిలువెత్తు తెలుగు సంతకం - సినారె వ్యక్తిత్వం’, 1998 సంవత్సరంలో ‘సాలోచన - పీఠికలు’, 2012 సంవత్సరంలో ‘వ్యాస కలశం’, 2016 సంవత్సరంలో ‘వ్యాస జిజ్ఞాస’ మొదలైన గ్రంథాలను వెలువరించారు.

### పరిశోధనలు

తెలుగులో వేమన పద్యాలను రుచి చూడనివారు ఉండరు. ప్రతి పద్యం రసాత్మక నైవేద్యం. అలటి పండు ఒలిచినట్లుగా సులువుగా, సులభంగా అర్థమై మన మదిని దోచుకుంటాయి. అలాంటి వేమన పద్యాల గురించి, జీవితం గురించి, సమకాలీన సమాజం గురించి చాలా వివరణాత్మకమైన, విశ్లేషణాత్మకమైన పరిశోధన ను తన పరిశోధన గ్రంథంలో చక్కగా వివరించారు.

ఉస్మానియా విశ్వవిద్యాల యంలో “ప్రజాకవి వేమన” అంశంపైన పిహెచ్.డి సాధికారికమైన పరిశోధన చేశారు. ఇందులో వేమన పద్యాల గురించే కాకుండా వేమన జీవితం, సమకాలీన కవుల తులనాత్మక అధ్యయనం గురించి విపులంగా, విస్తృతంగా వివరించారు. ఇంకా వేమనకు సంబంధించిన పరిశోధక గ్రంథాలను కూడా వెలువరి ంచారు. 1979 సంవత్సరంలో “ వేమన వాదం - వ్యాఖ్యానం “, 1980 సంవత్సరంలో “ప్రజాకవి వేమన”, 1990 సంవత్సరంలో “ వేమన పద్యాలు - పారిస్ ప్రతి”, 1998 సంవత్సరంలో “ తొలి పరిశోధకులు”, 2012 సంవత్సరంలో “ వేమన్న వెలుగులు - వ్యాఖ్యానం” వంటి రచనలు చేశారు. గోపి పిహెచ్.డి పరిశోధన గ్రంథం “ప్రజాకవి వేమన” అత్యుత్తమ పరిశోధన గ్రంథంగా గుర్తింపు పొందింది. ఇప్పటికీ ఈ గ్రంథం ఆరు పునర్ముద్రణలను పొందింది.

### యాత్రా రచనలు

డాక్టర్ ఎన్.గోపి వివిధ దేశాలను సందర్శించారు. ఆయా దేశాలను సందర్శించిన సందర్భంగా అక్కడి విశేషాలను కవితాత్మకం చేశారు. 1985 సంవత్సరంలో మారిషస్ ను సందర్శించిన సందర్భంగా “నేను చూసిన మారిషస్” పుస్తకాన్ని రచించారు. 2001సంవత్సరంలో సైప్రస్ దేశాన్ని సందర్శించిన సందర్భంగా “ నా సైప్రస్ యాత్ర “ పుస్తకాన్ని వెలువరించారు. 2002 సంవత్సరంలో అమెరికా, ఇంగ్లాండ్, జర్మనీ దేశాలను సందర్శించిన సందర్భంగా అక్కడి అనుభూతులను కవితామయం చేశారు. 2002 సంవత్సరంలో “ అమెరికాలో తెలుగు యాత్ర”, ఇంగ్లండ్ యాత్రను పురస్కరించుకుని “ ఇంగ్లండులో ఇరవైఐదు రోజులు “ పుస్తకాన్ని 2014 సంవత్సరంలో వెలువరించారు. జర్మనీ యాత్రను పురస్కరించుకుని 2015 సంవత్సరంలో జర్మనీ లో “ నా కవితా యాత్ర “ పుస్తకాన్ని వెలువరించారు. 2019 సంవత్సరంలో చైనా దేశాన్ని సందర్శించిన సందర్భంగా “ చైనాలో కవితా యాత్ర” పుస్తకాన్ని రచించారు. ఈ పుస్తకాలు చదవడం వల్ల ఆయా దేశాల విశేషాలు మనకు తెలుస్తాయి.

### అనువాదాలు

డాక్టర్ ఎన్. గోపి స్వయంగా కవియే కాకుండా అనువాదకులు కూడా. గోపి రాసిన అనేక పుస్తకాలు ఇతర భాషలోకి అనువాదమ య్యాయి. అలాగే గోపి కూడా ఇతర భాషా సాహిత్యాన్ని తెలుగులోకి చక్కగా అనువదించారు. 1985 సంవత్సరంలో “జ్ఞాన దేవుడు”, 2012 సంవత్సరంలో “తన్మయ ధూళి”, 2016 సంవత్సరంలో “మా ఊరి నది, పాగీ, విద్యాపతి ప్రణయగీతాలు”, 2019 సంవత్సరంలో “ జీది మాజీయా “( చైనీస్ కవితలు) లను అనువాదం చేశారు.

### ఇతర రచనలు



‘వందేమాతరం నుంచి జనగణమన వరకు’ గ్రంథాన్ని ఆవిష్కరించిన భారత మాజీ ప్రధాని పి.వి.నరసింహారావు. తెలుగు విశ్వవిద్యాలయ మెమొంటోను అందిస్తున్న ఉప కులపతి డా॥ఎన్. గోపి. చిత్రంలో ఆచార్య జయధీర్ తిరుమలరావు తదితరులు (2001).

డాక్టర్ ఎన్. గోపి కవిత్వమే కాకుండా ఇతర రచనలు కూడా చేశారు. 1982 సంవత్సరంలో “తెలుగు వాచకం - పాఠ్య పుస్తకం”, 1983 సంవత్సరంలో “ ప్రయోజన వాచకం - వయోజన విద్యా వాచకం “ , 2005 సంవత్సరంలో “ అక్షరయానం”(ఇండియాటుడే కాలమ్) వంటి రచనలు చేశారు.


### గోపి రచనలపై పరిశోధన

గోపి సాహిత్యంపై వివిధ విశ్వవిద్యాలయాల్లో ఎం.ఫిల్, పిహెచ్. డి పరిశోధనలు జరిగాయి. ఇప్పటివరకు వివిధ విశ్వవిద్యాలయాల్లో 5 పిహెచ్.డి లు, 4 ఎం.ఫిల్స్ పూర్తిచేశారు. అలాగే గోపీ కవితారీతులపై ప్రసిద్ధ పరిశోధకులు విమర్శనాత్మకంగా వివేచన చేశారు. 2000 సంవత్సరంలో డా. ద్వానా శాస్త్రి “గోపి కవితానుశీలన” అనే విమర్శాగ్రంథాన్ని రచించారు. 2004 సంవత్సరంలో ప్రసిద్ధ విమర్శకులు ఎం.నారాయణ శర్మ “ ఎన్.గోపి కవితారూప సృష్టి నానీలు - సమాలోచన” అనే పుస్తకాన్ని రచించారు. నానీలపై వచ్చిన తొలి విమర్శనాత్మక గ్రంథమిది. ఇదే సంవత్సరంలో ప్రముఖ కవి ఎస్.ఆర్.భల్లం “గోపి నానీల సమాలోచనం” అనే గ్రంథాన్ని తన సంపాదకత్వంలో వెలువరించారు.

2005 సంవత్సరంలో ఎం. ధనంజయ్ నాయక్ ఎన్.గోపి జలగీతం - వైజ్ఞానిక, మానవీయ తాత్త్విక దర్శనం” అనే గ్రంథాన్ని రచించారు. వైజ్ఞానిక, మానవీయ తాత్త్విక దృష్టితో వ్యాఖ్యానించిన గ్రంథం. 2008 సంవత్సరంలో ఎన్.అరుణ సంపాదకత్వంలో “ జల దీపిక “ పుస్తకం వెలువడింది. జలగీతం పై వచ్చిన విమర్శనాత్మక వ్యాసాల సంపుటి ఇది. 2010 సంవత్సరంలో డాక్టర్ పెన్నా శివరామకృష్ణ సంపాదకత్వంలో “డా.ఎన్.గోపి భావచిత్ర దీపాలు” వెలువడింది. 2017 సంవత్సరంలో ప్రముఖ విమర్శకులు ఎం.నారాయణ శర్మ “ఎన్.గోపి జలగీతం- కావ్య సమాలోచనం” అనే పుస్తకాన్ని రచించారు. ఇదే సంవత్సరంలో బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్ వారు “ఎన్.గోపి సాహిత్య స్ఫూర్తి” పేరుతో వ్యాస సంకలనం వెలువరించారు. 2018 సంవత్సరంలో “ ఎన్.గోపి సాహిత్యానుశీలనం “అనే విమర్శనాత్మకమైన గ్రంథాన్ని అగ్రశ్రేణి విమర్శకులు ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి రచించారు. 2020 సంవత్సరంలో ప్రసిద్ధ సాహిత్య విమర్శకులు డాక్టర్ పెన్నా శివరామకృష్ణ “ ఎన్. గోపి కవితా తత్త్వ వివేచన” పేరుతో గోపి కవితాతత్వాన్ని ఆమూలాగ్రం దర్శించారు. అలాగే గోపి 73 వ జన్మదినాన్ని పురస్కరించుకుని డా. ఎస్. రఘు సంపాదకత్వంలో “నిరంతర” అనే వ్యాస సంకలనాన్ని వెలువరి ంచారు. ఇందులో గోపి సమగ్ర సాహిత్యంపై వచ్చిన 90 వ్యాసాలు, సమీక్షలున్నాయి.

నిత్యం కవితాయానం చేస్తున్న డాక్టర్ ఎన్.గోపి విభిన్న ప్రక్రియలలో రచనలు చేసిన బహుముఖ ప్రజ్ఞాశాలి. కొత్త తరం యువకులకు మార్గదర్శి. ఎప్పటికప్పుడు కవిత్వాన్ని కొత్తగా చిగురింపజేస్తూ నిత్య చైతన్య కవితాపథికుడిగా మార్గదర్శనం చేస్తున్న డాక్టర్ ఎన్. గోపి కవితావిపానులందరికీ అక్షరపాత్ర.

*(ఆచార్య ఎన్. గోపి 74 వ జన్మదినం సందర్భంగా...)*



ఇంటర్వ్యూ :-
- డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్
9032844017



